క్లుప్తంగా

ప్రత్యేక కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత



కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

ధర్మపురి: విద్యార్థులో మేథో సంపత్తిని పెంపొందించేందుకు చేపట్టిన ఆక్టివిటీ ప్రోగ్రాం విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపురిలోని ఆంగ్లో వేదిక్ కాన్వెంట్ స్కూలులో ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ తోట శంకర్ ఆధ్వర్యంలో వివిధ రకాలైన కలర్ ఫుల్ హ్యాండ్ ప్రింట్ ఆక్టివిటీ ప్రోగ్రాంను నిర్వహించారు. దీని ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక, జ్ఞాపకశక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు నర్సరీ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించారు.కార్యక్రమంలో డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవలో పాల్గొనాలి



వాల్మీకి ఆవాసం విద్యార్థులకు పండ్లు, బిస్కట్స్ అందిస్తున్న ఎన్‌సీసీ కెడెట్స్

జగిత్యాల: ప్రతి ఒక్కరూ సేవలో పాల్గొనాలని ప్రిన్సిపల్ యాద రామకృష్ణ అన్నారు. రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవలో పాల్గొంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఎన్‌సీసీ కెడెట్స్ వాల్మీకి ఆవాసంలోని బాలబాలికలకు పండ్లు, బిస్కట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి సాయం



సామగ్రిని అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పేదింటి యువతి సోని వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చేయూతనందించారు. యువతి వివాహానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో ఆమె కుటుంబ సభ్యులు ట్రస్ట్ అధ్యక్షులు సురిగి శ్రీనివాస్‌ను కలిసి ఆదుకోవాలని కోరారు. దీంతో ఆదివారం ఆయన పట్టుచీరతో పాటు వంద మందికి సరిపడా భోజన సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సభ్యులు మణిదీప్, మనోజ్ తదితరులున్నారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు

బుగ్గారం: ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పోలీసుల తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన పోలీసులు పలు రహదార్ల వెంట ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యమైన రహదార్ల వెంట వచ్చి వెళ్లే వాహనాలను ఆపి అందులో నగదు, ఇతర విలువైన వస్తువులు ఏమైనా తరలిస్తున్నారా అనే కోణంలో తనిఖీలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అరికట్టడానికే విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు పోలీసు అధికారులు తెలుపుతున్నారు.

అమర జవాన్లకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కథలాపూర్: పాకిస్థాన్ ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన భారతీయులకు, సైనికులకు మండలంలోని సిరికొండలో ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు, నవతరం యూత్‌సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. సైనికుల సేవలను కొనియాడారు. దాడి జరిగిన నవంబర్ 26ను గుర్తు చేస్తూ 26/11 అని రాసి కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో నాయకులు కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, దేవేందర్‌గౌడ్, కళ్యాణ్, భూమయ్య, శేఖర్, ప్రతాప్, భరత్, రోషిత్ పాల్గొన్నారు.

సేవ చేసే అవకాశమివ్వండి

• వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



మేడిపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: రాముడు పద్నాలుగేళ్లు వనవాసం ఎదుర్కొంటే, తాను పదహారేళ్లుగా ఓడిపోతున్నా, మీ మధ్యే ఉంటూ, మీకు సేవ చేసుకుంటున్నానని, మీ కన్నబిడ్డగా అనుకొని, ఇప్పుడన్నా ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మేడిపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షోలో అన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లపల్లి, పోరుమల్ల, కట్లకుంట, మేడిపల్లి, కల్వకోట, వల్లంపల్లి, మాచపూర్, దమ్మన్నపేట, మన్నెగూడెం, ఈదులింగంపేట, గోవిందారం, పసునూర్, మోత్కురావుపేట, రాజలింగంపేట, రత్నాలపల్లి గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. నాలుగుసార్లు ఓడిపోయిన బాధను దిగమింగుకొని, ఎప్పుడు ప్రజల మధ్యే ఉన్నానని, ఈ ఎన్నిక డబ్బు ఉన్నోళ్లకు, పేదలకు జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. బహుజనుల బిడ్డగా ఒకవైపు నేనుంటే, దొరలు మరోవైపు ఉన్నారన్నారు. ఇన్ని రోజులు దొరలకు అవకాశం ఇచ్చారని, ఈ ఒక్కసారి బీసీ బిడ్డకు అవకాశం ఇవ్వండని కోరారు.



ప్రచారం చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల ప్రచారం

వేములవాడ: కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిట్టల మనోహర్, లీగల్ టీం సభ్యులు నరాల శ్రీనివాస్ భాను ప్రసాద్, శ్రీకాంత్ జెట్టి శేఖర్ ఆదివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఇంటింటా ప్రచారం చేశారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కాశవత్రి వంశీ, కార్యదర్శి రాధారపు సాయితేజ పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

• వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



వేములవాడ సుభాష్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు, హాజరైన ప్రజలు

వేములవాడ: ఈ ప్రాంతబిడ్డగా ఈ ప్రాంతానికి సేవలందించాలని ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలంతా ఆశీర్వదించి తనను అసెంబ్లీకి పంపిస్తే ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మాజీ కౌన్సిలర్ రాపెల్లి లావణ్య శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ప్రజలు ఆశీర్వదిస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సహకారంతో వేములవాడను ఎవరూ దత్తత తీసుకోకుండా స్వయంగా అభివృద్ధి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యావంతుడ్ని ఎన్నుకోండి

వేములవాడ బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు విద్యావంతుడనీ, ఆయన్ని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధిలో భాగం పంచుకోవాలని వికాస్‌రావు సతీమణి డాక్టర్ దీప అన్నారు.



ప్రచారం చేస్తున్న వికాస్‌రావు సతీమణి దీప

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి..



సారంగాపూర్ అటవీప్రాంతంలో మూలమలుపు వద్ద కూలిపోయిన సైడ్‌వాల్స్

సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మీదుగా మంచిర్యాల జిల్లాలోని జన్నారం వెళ్లే ప్రధాన రహదారిపై కూలిన హైలెవల్ కాజ్‌వే రెండు రోజుల క్రితం కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకోవడానికి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై సారంగాపూర్–లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతంలో దాదాపు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ హైలెవల్ కాజ్‌వే ఒక పక్క గతంలో తారు రోడ్డు చాలా వరకు కోతకు గురైంది. మూడు రోజుల క్రితం కాజ్‌వేకు ఇరువైపులా సెఫ్టీ వాల్స్ ఏర్పాటు చేశారు. జగిత్యాలకు వెళ్లే క్రమంలో ఎడమవైపు ఉన్న సైడ్‌వాల్‌ను వాహనం ఢీకొనడంతో సైడ్‌వాల్ సగం వరకు కూలిపోయింది. అటవీప్రాంతంలో మూలమలుపు (ఇరుకు రాళ్ల) వద్ద ఇది కూలిపోయి డబుల్‌రోడ్డు తారు కూడా కొంత వరకు వాగు(ఒర్రెలోకి)లోకి కూలిపోయింది. దీంతో ఏ కొంత ఏమరుపాటుగా ఉన్న పెద్ద ప్రమాదం జరుగుతుంది. ప్రమాదం జరిగితే వాహనం లోయలో పడిపోయే ప్రమాదం ఉంది. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అవ్వలారా.. ఒక్క అవకాశం ఇవ్వండి

• ధర్మపురి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రాయపట్నంలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: 'అవ్వలారా.. అక్కలారా.. అన్నలారా ఒక్కసారి మీ బిడ్డగా అవకాశమివ్వండి మీ రుణం తప్పక తీర్చుకుంటా. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను మీ ముందుకు తీసుకువస్తా ఆదరించండి' అని కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వేడుకున్నారు. మండలంలోని రాయపట్నంలో ఆదివారం సాయంత్రం గడప గడపకు ప్రచారం చేసి కొంగుపట్టి అడుక్కున్నాడు. గ్రామంలో నిర్వహించిన ప్రచారానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అవ్వా గత మూడు సార్లు గెలుపునకు సమీపంలో ఓటమిని చవిచూసినప్పటికి నేను మీ వెంటే ఉన్నానని గెలిచినా.. ఓడినా అడ్లూరి మీ వాడిగానే ఉంటానని రానున్న ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. తొమ్మిదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ పాలనలో ధర్మపురిలో అభివృద్ధి ఏమీ లేదని, చేతి గుర్తుకు ఓటేస్తే సమస్యలన్నీ తీరుస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారంకు చెందిన బీసీ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్ప మణిశర్మ ఆదివారం అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. పలు పార్టీలకు చెందిన వంద మంది యువకులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రూ.5 లక్షల విరాళం అందించారు. లక్ష్మణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మారంలో పాదయాత్ర చేశారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి



ప్రచారంలో భాగంగా మంత్రి ఈశ్వర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధులు

వెల్గటూర్: బీఆర్‌ఎస్ పాలన లోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్ మండలంలోని రాజక్కపల్లి, కిషన్‌రావుపేట గ్రామాల్లో ఆదివారం ప్రజాఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. అభివృద్ధిలో, సంక్షేమంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం దే అని కొనియాడారు. గత 40 ఏళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని కాంగ్రెస్ ఇప్పుడు మరోసారి అధికారంలోకి రావడానికి మోసపూరిత హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని, కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మరన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆదరించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మల్యాల: అకాల మరణం చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థికసాయం అందించి, ఉదారత చాటుకున్నారు. మల్యాల మండలంలోని పోచంపల్లి వెంకటేశ్ పది రోజుల క్రితం మృతి చెందగా, 2006–2007 పదో తరగతి విద్యార్థుల గ్రూపు స్నేహితుడి తల్లిని ఆదివారం కలిసి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. వెంకటేశ్ కుటుంబ సభ్యులకు తోడుగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ఎండీ సాజిద్, శ్రీనాథ్, రంజిత్, వేంకటేశం, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతు



ఫుటేజీ పరిశీలిస్తున్న ఎస్సై

మేడిపల్లి: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాల పనితీరును ఆదివారం ఎస్సై శ్యాంరాజ్ పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో వాటిని మరమ్మతు చేయించారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

యువకుల ఔదార్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని మోతీనగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం నుంచి పలువురు యువకులు శుద్ధజలం (మినరల్‌వాటర్) అందిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలు, నిర్వాహకులు తాగు నీటి కోసం ఇబ్బందిపడుతుండడంతో బీర్‌పూర్ మండలం మున్నూరు కాపు యువజన విభాగం సభ్యులు శుద్ధజలాన్ని అందించడానికి నిర్ణయించారు. కొనుగోళ్లు పూర్తయ్యే వరకు శుద్ధజలం సరఫరా చేస్తామని యువకులు పేర్కొన్నారు.

సీఎం సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కథలాపూర్: వేములవాడలో నిర్వహించిన సీఎం కేసీఆర్ సభకు కథలాపూర్ మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం తరలివెళ్లారు. మండలంలోని 19 గ్రామాల నుంచి వాహనాల్లో బయలుదేరారు. ఆయా గ్రామాల నాయకులు వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

సారంగాపూర్: జగిత్యాలలో ఆదివారం జరిగిన సీఎం కేసీఆర్ సభకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచిడి బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు తరలివెళ్లారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా విద్యుత్ శాఖ ఉద్యోగులు



మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌లో యువకుల నివాళి

జగిత్యాలజోన్/మల్లాపూర్/రాయికల్/మల్యాల: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌లో పవర్ బాయ్స్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం 74వ భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. మల్యాల మండల కేంద్రంలో వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. బ్లాక్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం

మల్లాపూర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ని గెలుపిస్తే.. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి, ప్రజలకిచ్చిన హామీలన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండలంలోని పలుగ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ గెలిచేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి పాలన అంతం చేద్దాం

కోరుట్ల: రాష్ట్రంలో సీఎం కేసీఆర్, కోరుట్లలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సాగిస్తున్న అవినీతి పాలనను అంతం చేద్దామని కోరుట్ల కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు కోరారు. ఆదివారం సాయంత్రం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు.కార్యక్రమంలో కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల అధ్యక్షుడు కొంతం రాజం, ఉరుమడ్ల వెంకటి పాల్గొన్నారు.



ఎఖీన్‌పూర్‌లో జువ్వాడి నర్సింగరావు ప్రచారం

మైనార్టీలు అండగా నిలవాలి

మెట్‌పల్లి/ మెట్‌పల్లి రూరల్: ఎన్నికల్లో మైనార్టీలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని ఆ పార్టీ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు కోరారు. పట్టణంలోని కీర్తి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ముస్లిం మైనార్టీలతో సమావేశమై మద్దతు కోరారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో జువ్వాడి నర్సింగరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా



కాంగ్రెస్‌లో చేరుతున్న బోర్నపల్లి నాయకులు

జగిత్యాలటౌన్/ రాయికల్/సారంగాపూర్: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఓటేస్తే అండగా ఉంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గోత్రాల కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని గోత్రాల కాలనీ, నూకపెల్లి అర్బన్ కాలనీతో పాటు రాయికల్ మండలానికి చెందిన మహిళలతో దేవిశ్రీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు.గతంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. పెంబట్లలో దుబ్బరాజన్న ఆలయంలో పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతుగా మంద కృష్ణ మాదిగ ప్రచారం



ప్రచారంలో మందకృష్ణ మాదిగ, బొడిగె శోభ

మల్యాల: ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో మాదిగలు బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మల్యాల లో ఆదివారం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొడిగె శోభకు మద్దతుగా ప్రచారం చేశారు. ఏళ్ల తరబడి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మాదిగలు బుద్ధి చెపి, శోభకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

ఆడబిడ్డకు అవకాశం ఇవ్వండి

రాయికల్: ఆడబిడ్డకు ఒక్కసారిగా ఎమ్మెల్యే గా అవకాశమివ్వాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి భోగ శ్రావణి కోరారు. ఆదివారం మండలం లోని చెర్లకొండాపూర్, ఒడ్డెలింగాపూర్, ధర్మాజీపేట,జగన్నాథ్‌పూర్, కుర్మాపెల్లి, శ్రీరాంనగర్, సింగరావుపేట గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు. తనకు ఓటేసి గెలిపించాలని కోరారు.

ఇబ్రహీంపట్నంలో కేంద్ర బలగాల కవాతు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీ నారాయణ, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం కేంద్ర బలగాలు నిర్వహించిన కవాతును ఎస్సై జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. బ్యాండ్ మేళా, డీజేలతో ర్యాలీ నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి కేంద్ర బలగాలకు బొట్టు పెట్టి స్వాగతించారు. వీడీసీ సభ్యులు కేంద్ర బలగాలను సన్మానించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు ఉమాసాగర్, చిరంజీవి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమండెంట్ రామ్,స్వరూప్, సిస్తోను, సిబ్బంది పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో జెండా ఊపి కవాతు ప్రారంభిస్తున్న సీఐ, ఎస్సై